క్లుప్తంగా

ఓటర్ల సర్వే పరిశీలన

కొత్తపల్లి: గ్రామాల్లో జరుగుతున్న ఓటర్ల సర్వేను పారదర్శకంగా చేయాలని ఆర్‌ఐ పొన్నాల బీఎల్‌ఓలకు సూచించారు. మండలంలోని వాకతిప్ప, కుతుకుడుమిల్లి, కొత్తపల్లి గ్రామాల్లో జరుగుతున్న సర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటర్లుగా నమోదు కావాలన్నారు. ఒకే ఇంట్లో 10 ఓట్లు మించి ఉంటే వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బీఎల్‌ఓలు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్లను వివరాలు అడిగి తెలుసుకోవాలన్నారు. ఓటరు లిస్టులో ఉన్న వారి పేరు చదివి వినిపించడంతో పాటు వారి ఫొటోలను ఓటర్లకు చూపించాలన్నారు. ఓటర్లకు ఉన్న అభ్యంతరాలను నివృత్తి చేయాలని సూచించారు. ఆయన వెంట రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సామర్లకోట: మండల పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీఓ డి.శ్రీలలిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాపవరం-1, పవర-1, వీకే రాయపురం-1, వేట్లపాలెంలో ఒక వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, పదో తరగతి విద్యార్హత కలిగి ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల ఐదో తేది లోపుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

అక్రమ మైనింగ్ ఆపాలి

పెద్దాపురం: రామేశంపేట అక్రమ మైనింగ్‌ను అడ్డుకోవాలని ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. స్థానిక 1వ వార్డు పాత పెద్దాపురం దమ్ముపేటలో బుధవారం రైతు కూలీలతో కలసి అక్రమ మైనింగ్ ఆపాలని ధర్నా చేశారు. దళితులకు ఇచ్చిన భూముల్లో అప్పటి టీడీపీ ప్రభుత్వం, ప్రస్తుత ఎమ్మెల్యే హయాం నుంచి అక్రమ మైనింగ్ వ్యాపారానికి తెరతీశారన్నారు. అప్పటి నుంచి జరుగుతున్న అక్రమ మైనింగ్‌ను అడ్డుకోలేని ఎమ్మెల్యే సవాల్ విసిరి బహిరంగ చర్చకు సిద్ధమని మళ్లీ వెనుకడుగు వేయడం తగదన్నారు. అధికారులు చొరవ చూపి మైనింగ్‌ను నిలువరించాలని అన్నారు. దేశెట్టి సురేష్, కోట వీరబాబు, గండ్రేడు సూరిబాబు, దమ్ము లోవరాజు, రాంబాబు రైతుకూలీలు పాల్గొన్నారు.

తాగునీరు కలుషితం



కొమరగిరిలో తాగునీటి కుళాయి నుంచి వచ్చిన పురుగులు

కొత్తపల్లి: మండలంలోని కొమరగిరిలో తాగునీరు కలుషితమవుతోంది. పైపులైన్లు మరమ్మతులకు గురికావడంతో పంచాయతీ కుళాయిల నుంచి వస్తున్న తాగునీరు రంగుమారి దుర్వాసన వెదజల్లుతోంది. ముఖ్యంగా ప్రధాన పైపులైను డ్రైనేజీల కింద ఉండడం, పలు చోట్ల మరమ్మతులకు గురికావడంతో తాగునీటి కుళాయిల నుంచి జలగలు, చిన్న చిన్న పురుగులు వస్తున్నాయి. కుళాయిల నుంచి వస్తున్న నీరు కనీసం వాడుకోవడానికి కూడా వీలులేని విధంగా ఉంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రక్షిత తాగునీటి సరఫరాపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మహిళలపై హింసను ప్రోత్సహించొద్దు

పెద్దాపురం: మహిళలపై హింసను అరికట్టాల్సిన ప్రభుత్వాలు హింసను ప్రోత్సాహిస్తున్నాయని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ప్రారంభమైన జాత బుధవారం పెద్దాపురం చేరుకుంది. స్థానిక ఐద్వా నాయకులు జాతాకు స్వాగతం పలికారు. ఐద్వా అధ్యక్షురాలు కూనిరెడ్డి అరుణ అధ్యక్షతన జరిగిన సభలో పద్మావతి మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనన్నారు. ఈ కార్యక్రమంలో వరలక్ష్మి, పూర్ణ, సత్యవతి, రొంగల సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

ప్రత్తిపాడు: ప్రజలు గంజాయి, సారా వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని స్థానిక ఎస్‌ఈబీ సీఐ పి.అశోక్ సూచించారు. స్థానిక మార్కెట్ వద్ద బుధవారం డ్రగ్స్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా, గంజాయి రవాణా, క్రయ విక్రయాలపై ఎటువంటి సమాచారం తెలిసినా వెంటనే ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వ్యక్తి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. స్థానిక ఎస్‌ఈబీ ఎస్సై బి.శ్రీనివాసరావు, హెచ్‌సీలు ఎస్. వెంకన్నదొర, ఎల్.కృష్ణార్జున పాల్గొన్నారు.

నేటి నుంచి పాల సేకరణ ప్రారంభం



గొల్లప్రోలులో పాల సేకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ ఇలక్కియ

- జేసీ ఇలక్కియ

పిఠాపురం: జిల్లాలోని జగనన్న పాల వెల్లువ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించి, రైతుల నుంచి పాలు సేకరించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జేసీ ఇలక్కియ తెలిపారు. పిఠాపురం నియోజకవర్గంలోని పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో జగనన్న పాల వెల్లువ కేంద్రాల్లో ఆటోమేటిక్ మిల్క్ కలెక్షన్ యూనిట్లలో (ఏఎంసీయూ) ఏర్పాట్లను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో జగనన్న పాల వెల్లువ ద్వారా తొలి విడతలో ఎనిమిది మండలాల పరిధిలో 96 గ్రామాల్లో పాలు సేకరించడానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. తొలి దశలో తుని, కోటనందురు, శంఖవరం, రౌతులపూడి, తొండంగి, గొల్లప్రోలు, కొత్తపల్లి, పిఠాపురం మండలాల పరిధిలో 96 గ్రామాల నుంచి పాలను సేకరించనున్నట్లు ఆమె తెలిపారు. 2684 మంది మహిళలను గ్రూపులుగా ఏర్పాటు చేసి ప్రతి గ్రూపునకు ప్రమోటర్లు, సెక్రటరీలను ఎంపిక చేసినట్లు చెప్పారు. అమూల్ డైయిరీకి పాలను తరలించేందుకు 10 రూట్లను ఎంపిక చేసినట్లు ఆమె తెలిపారు. ఆటోమేటిక్ మిల్క్ కలెక్షన్ యూనిట్ నుంచి పాలను తుని మండలం రేఖవానిపాలెంలోని బల్క్ మిల్క్ యూనిట్‌కు తరలిస్తారని ఆమె వివరించారు. జెడ్పీ సీఈఓ ఎ.రమణారెడ్డి, పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ ఎన్‌జసూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ కుటుంబ సభ్యులకు భరోసా



ఉపాధ్యాయిని కుటుంబ సభ్యులకు చెక్కు అందజేసిన ఎంపీపీ, ఎంఈఓలు, ఉపాధ్యాయులు

సామర్లకోట: ఉపాధ్యాయులుగా పని చేస్తూ యూటీఎఫ్‌లో సభ్యత్వం కలిగిన వారి కుటుంబాలకు యూటీఎఫ్ భరోసా ఇస్తుందని మండల యూటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు ఎస్వీ రామారెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌లు తెలిపారు. ఇటీవల ఉపాధ్యాయునిగా పని చేసి మృతి చెందిన సామన దుర్గ కుటుంబానికి యూటీఎఫ్ సంక్షేమ నిధి నుంచి రూ.మూడు లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్ని చెక్కును అంద జేశారు. యూటీఎఫ్ సేవలను ఎంపీపీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు వై.శివ రామకృష్ణయ్య, పి.వుల్లయ్య, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కేఎంఎంఆర్ ప్రసాద్, హెచ్‌ఎం కె.బలరాంచౌదరి, ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, పుట్టా వెంకటేశ్వరరావు, టీవీవీ సత్యనారాయణ, రమణ తదితరులు పాల్గొన్నారు.

6 నాటికి ఎడ్యుకేషన్ సర్వే పూర్తిచేయాలి

కరప: మండల పరిధిలో ఈనెల 6వ తేదీ నాటికి ఎడ్యుకేషన్ సర్వే పూర్తి చేసి, డ్రాప్ అవుట్ల గణాంకాలు రూపొందించాలని ఎంఈఓ-1 కె.బుల్లికృష్ణవేణి, ఎంఈఓ-2 ప్రత్తి సత్యనారాయణ సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎడ్యుకేషన్ సర్వేపై చర్చించి, అనుసరించాల్సిన విధివిధానాలపై పలు సూచనలిచ్చారు. గ్రామ వలంటీర్లు, హెచ్‌ఎంలు విడివిడిగా చేసిన సర్వేరిపోర్టులు వ్యత్యాసాలు లేకుండా ఒకేలా ఉండాలన్నారు. బడి ఈడు పిల్లలను ఎవరైనా మొండికేసి, బడికి పంపమంటే వారితో రాతపూర్వకంగా తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ కె.అప్పారావు, ఈఓ పీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అవయవ దానంపై అవగాహన కల్పించండి

కరప: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా అవయవ దానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ కె.అప్పారావు అధికారులకు సూచించారు. మండల పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఓటీఎస్ డాక్యుమెంట్లను పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన గ్రామ కార్యదర్శులు, సచివాలయ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. గురువారం ఆజాదీగా అమృత్ మహోత్సవ్ సమావేశాలు నిర్వహించాలన్నారు. పశువులు రోడ్లపై తిరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి పన్నులను నూరు శాతం వసూలు చేయాలన్నారు.

'ఉలిక్కిపడ్డ ఉప్పాడ' అలరిస్తుంది

- హాస్యనటుడు గౌతంరాజు

కాకినాడ కల్చరల్: 'ఉలిక్కిపడ్డ ఉప్పాడ' చిత్రం అలరించే చిత్రమని హాస్యనటుడు గౌతమ్ రాజ్ పేర్కొన్నారు. చిత్రీకరణ పూర్తయిన సందర్భంగా చిత్ర యూనిట్ విలేకరుల సమావేశం నిర్వహించారు. మత్స్యకారుల జీవన విధానంపై ఇప్పటి వరకు ఎవరూ తీయని విధంగా ఈ చిత్రం నిర్మించామన్నారు. ప్రతి కుటుంబంలో జరిగే సంఘటనలు చిత్రంలో ఉన్నాయన్నారు. చిన్న బడ్జెట్‌లో అత్యుత్తమ విలువలతో తీసిన సినిమా అని, మద్యపానం వల్ల కలిగే దుష్పరిణామాలు తెలియజెప్పే సందేశం ఇందులో ఇమిడి ఉందన్నారు. స్థానిక మత్స్యకారులు ఎంతో సహకరించారని, కొత్తవారికి, ముఖ్యంగా స్థానిక నటులకు ఇందులో ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. ప్రతి ఒక్కరు వారి పాత్రలకు న్యాయం చేశారని, చిన్న బడ్జెట్ లో పెద్ద సినిమా 'ఉలిక్కిపడ్డ ఉప్పాడ' అన్నారు. ఇందులో చేసిన నటులకు అవార్డు రావడానికి అవకాశాలు ఉన్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దర్శకుడు సాయి కుమార్, నిర్మాత ఉదయ్ కిరణ్, నటులు నైనా, స్నేహ, డీఎస్ఎల్వీ ప్రసాద్, సాయి ప్రసాద్ తదితరులు మాట్లాడారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న హాస్యనటుడు గౌతమ్ రాజ్

సమస్యల పరిష్కారానికి చర్యలు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పిఠాపురంలో గడపగడపకూ మన ప్రభుత్వం



పిఠాపురంలో లబ్ధిదారులకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: పట్టణంలోని ప్రధాన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే పెండెం దొరబాబు తెలిపారు. పిఠాపురం 1వ వార్డు సచివాలయం పరిధిలోని అగ్రహారంలో బుధవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్లి వారికి ప్రజల సమస్యలు తెలసుకున్నారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా ? లేదా ? అని ఆరా తీశారు. గత నాలుగేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులు స్వీకరించి వాటి పరిష్కారానికి వెంటనే తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రధాన సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ప్రభుత్వానికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేక ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయన్నారు. ఇప్పటివరకూ ఏ ప్రభుత్వం చేయని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. తమ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నట్టు తెలిపారు. టీడీపీ నేతలకే పథకాలు ఇస్తున్నామని, వివక్షత అనేది ఎక్కడా లేకుండా పారదర్శకంగా పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

పింఛన్లు అందజేస్తున్న వలంటీర్లు



అయోధ్యరామపురంలో లబ్ధిదారుకు పింఛను అందజేసిన వలంటీర్లు ప్రతాప్, వరలక్ష్మి

సామర్లకోట: పింఛన్ల పంపిణీ 100 శాతం పూరి అయ్యేలా వలంటీర్లు ఇంటింటా రెండో రోజు బుధవారం సామాజిక పింఛన్ల పంపిణీ కొనసాగించారు. మొదటి రోజు కొంత మంది అందుబాటులో లేక పోవడంతో వారి బంధువులకు సమాచారం ఇచ్చి లబ్దిదారుల వద్దకు వెళ్లి పింఛన్లు అందజేశారు. రెండో రోజు పట్టణంలో 99 శాతం, మండల పరిధిలో 97 శాతం పూర్తయినట్టు అధికారులు తెలిపారు.

ఐదుగురి బైండోవర్

ప్రత్తిపాడు: స్పందనలో వచ్చిన ఫిర్యాదు మేరకు ఐదుగురిని బైండోవర్ చేసినట్టు ప్రత్తిపాడు ఎస్‌ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు. ఏలేశ్వరం మండలం పెద్దనాపల్లి గ్రామానికి చెందిన కట్టు కుమారి, కుంచే సత్యవతి, దడాల కుమారి, కడాలి చంద్రం, దడాల రాయుడులపై బైండోవర్ కేసులు నమోదు చేసి, ఏలేశ్వరం తహసీల్దార్ వద్ద హాజరుపరచినట్టు చెప్పారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు



రౌతులపూడిలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ గొల్లు చినదివాణం

రౌతులపూడి: ప్రకృతి వ్యవసాయంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం అన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో బుధవారం ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు విత్తనాలు, ఇతర వ్యవసాయ పరికరాలు పంపిణీ చేశారు. షెడ్యూల్ కులాలకు చెందిన రైతులకు రూ.9,000 విలువ చేసే వ్యవసాయ పనిముట్లు అందించారు. మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను, మండల వ్యవసాయాధికారి రెడ్డి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యువత భాగస్వామ్యంతో దేశాభివృద్ధి



గుడివాడలో యూబీఐ కార్యక్రమం నిర్వహిస్తున్న పావని, సీమదొర తదితరులు

పెద్దాపురం: దేశాభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలని వైఎస్సార్ సీపీ నాయకుడు, గుడివాడ సర్పంచ్ కనపర్తి సీమదొర అన్నారు. కేంద్ర మానవ వనరుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఉన్నత భారత అభియాన్ (యూబీఐ) కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ సీమదొర, యూబీఐ రీజనల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ బి.పావని మాట్లాడుతూ విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలన్నారు. గ్రామాల్లో ప్రజా సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించడమే యూబీఐ ముఖ్యోద్దేశం అన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు కనపర్తి బాబి, మహిళా కళాశాల లెక్చరర్ జి.పావనిదేవి, ఎంపీ హరినాథబాబు, ఎం.సతీష్, శంభూ ప్రసాద్, సత్యనారాయణ. నరేష్, ఎ.ఫణిభాస్కర్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



డ్వామా అధికారులకు సర్టిఫికెట్లు అందజేసిన కృష్ణమోహన్ తదితరులు

సామర్లకోట: డ్వామా అధికారులకు మూడు రోజుల పాటు ఇచ్చిన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ కమిషనర్ ఇ.కృష్ణమోహన్ అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, పార్వతీపురం మన్యం జిల్లాలో పని చేస్తున్న డ్వామా ఏపీడీ, ఏపీఓ మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణ బుధవారంతో ముగిసింది. డ్వామాలో రూపొందించిన కొత్త సాఫ్ట్‌వేర్, పనుల్లో నాణ్యత, సాంకేతిక పరిజ్ఞానం, వ్యక్తిత్వ వికాసం, పోషక విలువలు కలిగిన మొక్కలు నాటించేలా చేయడంపై మూడో రోజు శిక్షణ నిర్వహించారు. శిక్షణకు మొదటి బ్యాచ్‌లో 52 మంది హాజరయ్యారు. ఈ మేరకు మూడు రోజుల పాటు నేర్చుకున్న అంశాలపై ఫీడ్‌బ్యాగ్ నిర్వహించారు. ఈటీసీలో నిర్వహించిన ఏడు బ్యాచ్‌ల శిక్షణలో 11 జిల్లాల నుంచి 242 మంది శిక్షణ ఇస్తామని ఈ కృష్ణమోహన్ చెప్పారు. శిక్షణ కో ఆర్డినేటర్ ఎంఎస్ఎన్ రెడ్డి ఫ్యాకల్టీలు పి. శ్రీనివాసరావు, వి.ప్రసాద్, ఎస్‌కె మోహిద్దీన్ జీఎస్ఆర్ ఆంజనేయులు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కృష్ణమోహన్ సర్టిఫికేట్లు అందజేశారు.

ఆనందమీనందమాయె

కొత్తపల్లి: సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులకు బుధవారం భారీగా మత్స్యసంపద చిక్కింది. చేపల విక్రయాలతో అమీనాబాద్ తీర ప్రాంతం కిటకిటలాడింది. మత్స్యకారుల వలలకు ఎక్కువగా కదుర్లు, రొయ్యలు, కవళ్లు తదితర రకాల చేపలు చిక్కాయి. వీటిని కొనుగోలు చేసిన మత్స్య సంపద తమిళనాడు, కేరళ, హైదరాబాద్, కర్ణాటక రాష్ట్రాలకు తరలించారు.







చేపలకు వేలం నిర్వహిస్తున్న వ్యాపారులు. (ఇన్ సెట్‌లో) మత్స్యకారుల వలలకు చిక్కిన రొయ్యలు, కదురు చేపలు

వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు

జగ్గంపేట: నూతన వైద్య విధానాలపై పీఎంపీలు అవగాహన పెంచుకోవాలని రాజమహేంద్రవరానికి చెందిన మాగ్న తల్లీపిల్లల ఆసుపత్రి వైద్య నిపుణులు డాక్టర్ వినయ్‌మోహతా సూచించారు. జగ్గంపేట షాదీఖానాలో బుధవారం కమ్యూనిటీ పారా మెడిక్స్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టీఎస్ మూర్తి అధ్యక్షతన వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వినయ్‌మెహతా మాట్లాడుతూ ప్రథమ చికిత్స అందించడంలో పీఎంపీల పాత్ర ఎంతో కీలకమన్నారు. చిన్నారులకు వచ్చే జ్వరాలు, డయేరియా, పలు వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం డాక్టర్ వినయ్‌మోహతాను అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. పీఎంపీ అసోసియేషన్ జిల్లా కో కన్వీనర్ బళ్లా శ్రీనివాసరావు, మండల కో కన్వీనర్ జగతా బాబ్జీ, నూరుద్దీన్ బాషా, ఎ.సత్యనారాయణ, జగ్గంపేట, గండేపల్లి మండలాలకు చెందిన పీఎంపీలు పాల్గొన్నారు.



వైద్య విజ్ఞాన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ వినయ్ మెహతా

సాగుకు ప్రోత్సాహం.. రైతుకు ఉత్సాహం

- ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంచేందుకు ప్రభుత్వం చర్యలు
- అన్నదాతలకు పలు రాయితీలు అందజేత
- తుని సబ్ డివిజన్ పరిధిలో 3,316 ఎకరాల్లో సాగు

తుని రూరల్: ఆయిల్‌పామ్ రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోంది. రైతులకు లాభాలు తెచ్చిపెడుతున్న ఆయిల్ పామ్ తోటల సాగు విస్తర్ణం పెంచేందుకు ఉద్యానశాఖ ద్వారా రాయితీలు ఇస్తోంది. మంచి గిట్టుబాటు ధర కల్పిస్తున్న ప్రభుత్వం కొత్తగా మొక్కలు నాటే రైతులకు పలు రాయితీలు ప్రకటించింది. అధికారుల చుట్టూ తిరగకుండా గ్రామంలోనే రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకునే అవకాశాన్ని కల్పించింది.

25 వేల ఎకరాల్లో సాగు

కాకినాడ జిల్లాలో ఇప్పటికే 25 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలు ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో మరో ఐదు వేల ఎకరాల్లో సాగు విస్తరణం పెంచాలన్నది లక్ష్యం. ఉద్యానశాఖ తుని సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో 3,316 ఎకరాల్లో రైతులు ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారు. ఈ సంవత్సరం మరో 625 ఎకరాల్లో మొక్కతోటలు వేసేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఈ సీజన్‌లో ఆయిల్ పామ్ మొక్కలు వేస్తే నాలుగేళ్లకు ఫలసాయం అందనుంది. ఈ కాలంలో రైతులు ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు అంతర పంటల సాగును ప్రోత్సహిస్తోంది. ఇందుకూ అదనపు రాయితీలు అందిస్తున్నట్టు ఉద్యానశాఖ అధికారులు తెలిపారు. పొలంలో బోరుబావి ఉండీ కొత్తగా సాగు చేపట్టే రైతులకు రాయితీలు లభిస్తాయి.

625 ఎకరాల్లో సాగు విస్తరణకు ప్రణాళిక

ఉద్యానశాఖ తుని సబ్ డివిజన్ పరిధిలో 2023-24 పంట కాలంలో 625 ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్క తోటలను విస్తరించాలని లక్ష్యంగా అధికారులు నిర్దేశించారు. తుని, కోటనందూరు, తొండంగి, రౌతులపూడి, శంఖవరం మండలాల్లో రైతులను ప్రోత్సహించేందుకు రాయితీలు అందిస్తున్నారు. హెక్టారుకు 143 ఆయిల్‌పామ్ మొక్కలను నాటుకుంటే ఉద్యానశాఖ రాయితీ ఇస్తోంది. ఒక్కొక్క మొక్క విలువ రూ.193, ఇందులో రైతుకు రూ.100 రాయితీ లభిస్తుంది. ప్రతి సంవత్సరం ఎరువుల నిర్వహణకు రూ.5,250 చొప్పున నాలుగేళ్లకు రూ.21 వేలు ఇవ్వనున్నారు. అదనంగా 50 శాతం (రూ.50 వేలు మించకుండా) రాయితీపై చాప్ కట్టర్, హార్వెస్టింగ్ ఫోల్ ఇస్తున్నారు.

అంతర పంటలకు అదనపు రాయితీలు

ఆయిల్‌పామ్ మొక్కలు వేసిన నాలుగేళ్ల నుంచి ఫలసాయం అందనుంది. అప్పటి వరకు అంతర పంటలు సాగు చేసే రైతులకు ఉద్యానశాఖ అదనపు ప్రోత్సాహకాలను అందిస్తోంది. ఆయిల్‌పామ్ తోటలో మొక్కజొన్న, పొగాకు, వేరుశనగ, బొప్పాయి, అరటి, నువ్వులు, పొద్దు తిరుగుడు, బంతి, చామంతి, చిలకడ దుంపలు, కర్రపెడ్లం, పసుపు, కంద, అల్లం, మినుములు, పెసలు, ఉలవలు, కందులు, చెరకు, కూరగాయలు తదితర పంటలను రైతులు పండించుకోవచ్చు. ఇందుకు నాలుగేళ్లపాటు ప్రతిసంవత్సరం రూ.5,250 చొప్పున అదనపు రాయితీ లభిస్తుంది.



మొక్కతోటలను పరిశీలిస్తున్న హెచ్‌ఓ విజయలక్ష్మి

> **ఆర్‌బీకేల్లో దరఖాస్తు చేయాలి**
>
> బోరుబావి, ఆయిల్‌పామ్ మొక్కలు ఉన్న పొలంలో అంతర పంటల సాగు చేసుకోవచ్చు. ఆయిల్‌పామ్ సాగు చేపట్టే రైతులు తమ పట్టాదార్ పాసు పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా నకళ్లు, పాస్‌పోర్టు సైజు ఫొటోతో రైతు భరోసా కేంద్రానికి వెళ్లి పూర్తి వివరాలను నమోదు చేయించుకోవాలి. అలా నమోదు చేయించుకున్న రైతులకు విస్తీర్ణాన్ని బట్టి మొక్కలను ఉద్యానశాఖ సరఫరా చేస్తుంది. నిర్వహణకు ఎరువులను ప్రతి సంవత్సరం అందిస్తారు. ఆయిల్‌పామ్ మొక్కలు వేసుకున్న తర్వాత అంతర పంటల సాగుచేసే రైతులకు అదనపు రాయితీలు లభిస్తాయి.
>
> – జి.విజయలక్ష్మి, ఉద్యాన అధికారి, తుని



సారాతో వ్యక్తి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) పరిధిలోని గ్రామాల్లో బుధవారం నిర్వహించిన దాడుల్లో 30 లీటర్ల సారాతో వ్యక్తిని అరెస్టు చేసినట్టు ప్రత్తిపాడు ఎస్‌ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు. ప్రత్తిపాడు మండలం వేములపాలెం మూడు రోడ్ల జంక్షన్ వద్ద మోటారు సైకిల్‌పై సారా తరలిస్తున్న అదే గ్రామానికి చెందిన బర్ల లోవరాజును అదుపులోకి తీసుకుని, అతని నుంచి బైక్, 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో చీకట్ల లక్ష్మిపై కూడా కేసు నమోదు చేసినట్టు చెప్పారు. అలాగే ప్రత్తిపాడు మండలం లంపకలోవలో సారా స్థావరంపై దాడి చేసి, సారా తయారీకి సిద్ధం చేసిన 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఈ కేసులో అదే గ్రామానికి చెందిన వాసంశెట్టి సత్యనారాయణపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఈబీ పోలీసులు తెలిపారు.